## జన్యుమార్పిడి వంగడాల సాగుకు

# ప్రభుత్వ అనుమతి తప్పనిసరి చేయాలి

హైదరాబాద్, జూలై 31 (ఆన్‌లైన్, సిటీబ్యూరో): జన్యుమార్పిడి వంగడాలను ప్రవేశపెట్టేటప్పుడు రాష్ట్ర ప్రభుత్వ అనుమతి తీసుకోవాలనే నిబంధనను తప్పనిసరిగా అమలుచేయాలని కేంద్ర పర్యావరణ, అడవుల శాఖ మంత్రి జయంతి నటరాజన్‌కి లేఖ రాస్తున్నట్లు సదరన్ యాక్షన్ ఆన్ జెనిటెక్ ఇంజనీరింగ్ కన్వీనర్ పీవీ సతీష్ తెలిపారు. ప్రైవేట్ కంపెనీలు ఇష్టారాజ్యంగా వంగడాలను ప్రవేశపెట్టకుండా కఠినమైన విధానాన్ని అవలంభించాలని లేఖలో పేర్కొన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి జన్యుమార్పిడి పంటను ప్రవేశపెట్టేటప్పుడు జెనెటిక్ ఇంజనీరింగ్ అప్రూవల్ కమిటీ అమోదం పొందాల్సి ఉంటుందనితెలిపారు. రైతుల అనుమతితోనే వారి పొలాల్లో జన్యుమార్పిడి వంగడాల సాగు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. జన్యుమార్పిడి వంగడాల సాగుకు రాష్ట్రప్రభుత్వ అనుమతి ఉండాలనే నిబంధనలకు ముందు అంగీకరించిన ఏబీఎల్ఈ-ఏజీ (అసోసియేషన్ ఆఫ్ బయోటెక్ లెడ్ ఎంటర్‌ప్రైజెస్ - అగ్రికల్చర్ గ్రూప్ ) ఇప్పుడు నిబంధనను తొలగించాలని అభ్యంతరం వ్యక్తంచేస్తుందని అన్నారు. జన్యుమార్పిడి పంటలను అంగీకరించకపోతే ఆహారభద్రత ఏర్పడుతుందనే వాదన సరికాదన్నారు. ఆ పంటల సాగుతో అధిక దిగుబడులు వస్తాయనేది వట్టి భ్రమేనన్నారు. జన్యుమార్పిడి విత్తనాలు పరిశోధనలకు పనికిరావన్నారు. ఈ విత్తనాలపై పరిశోధనకు ఎవరికీ అనుమతి లేదన్నారు. ఎన్‌పీఎమ్ జాయింట్ కన్వీనర్ కవుల సరస్వతి, హ్యూమన్ రైట్స్ లా నెట్‌వర్క్ కోఆర్డినేటర్ ఎంఏ షకీల్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.